క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారంలో భాగం కావాలి

భామిని: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారంలో సహాయ సర్వేయర్లు భాగస్వాములు కావాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ సహాయ సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నేరడి-బి నుంచి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక కేంద్రంలో షిఫ్టుల వారీగా పని చేయాలన్నారు. అలాగే రెవెన్యూ సిబ్బందిని సమన్వయం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె. కృష్ణారావు, వీఎస్ఏలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

భామిని: మండలంలోని కీసర దుర్గాదేవి మండపం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మహిళా కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు భక్తిగీతాలకు కళాకారులు నృత్యం చేశారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఆలయం చరిత్ర వివరిస్తున్న అర్చకులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కలెక్టర్ కుటుంబ సభ్యులను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. అనంతరం కలెక్టర్, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనుల వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృంద సభ్యులు

మక్కువ: మండలంలోని కాశీపట్నం, మార్కొండపుట్టి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. కేంద్ర బృందం సభ్యులు ఎం.కె.శశి ఆపస్, కేజీ సలీమ్‌కుమార్ ఆయా పంచాయతీల్లో పర్యటించి ఉపాధి నిధులతో చేపట్టిన పనులు, వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, వీఓలతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ, ఏపీడీ ఎన్ఆర్ఈజీఎస్ ఎన్. రమేష్ రామన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణ పరిధిలోని ప్రధాన నీటి సరఫరా కేంద్రం నుంచి పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురైనందున మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని కమిషనర్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

కమిషనర్ పర్యటన

సాలూరు: పట్టణంలో 28, 29 వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ సోమవారం పర్యటించారు. ఆయా వార్డుల్లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగకపోవడాన్ని గుర్తించారు. వెంటనే వాటికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది కొత్త లైట్లు ఏర్పాటు చేశారు.

ప్రాణం తీసిన నాటువైద్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పాము కాటుకు నాటు వైద్యాన్ని ఆశ్రయించిన వ్యక్తి ప్రాణాలు విడిచాడు. కుటుంబ సభ్యులకు కన్నీరుమిగిల్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురుపాం మండలం సీడుమానుగూడకు చెందిన ఆరిక మోహన్‌రావు(26) భార్యతో కుమారుడితో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా 5 తేదీ అర్ధరాత్రి పాము కాటేసింది. వెంటనే తనకు తెలిసిన పసురు మందు వేసుకొని మరుసటి రోజు నాటు వైద్యుడిని ఆశ్రయించాడు. ఆస్పత్రికి వెళ్లాలంటూ కుటుంబ సభ్యులు చెప్పినా వినిపించుకోలేదు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా మోహనరావు స్పృహకోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో కురుపాం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతునికి భార్య, రెండునెల వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు. కురుపాం ఎస్ఐ పి. నారయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి కోతలు ఆరంభం

- తగ్గిన దిగుబడి
- ఆందోళనలో రైతన్నలు



నీలానగరం సమీపంలో యంత్రంతో వరి పంట కోత



వరి పంటను వెంటనే బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు

వీరఘట్టం: మండలంలోని నీలానగరం, తెట్టంగి, ఎం.వి.పురం, కుమ్మరిగుంట, బిటివాడ, పనసనందివాడ, తదితర ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో సోమవారం వరికోతలు మొదలయ్యాయి. ఆ ప్రాంతాల్లో వేసిన తేలికపాటి 1156 తరంగణి రకం వరిపంట కోతకు రావడంతో యంత్రాలతో కోతలు కోస్తున్నారు. కోతలు జరిగిన వెంటనే 80 కిలోల బస్తా రూ. 1450 చొప్పున వ్యాపారులు పొలం దగ్గరే కొనుగోలు చేస్తున్నారు. యంత్రాలతో కోసిన వెంటనే ధాన్యంను బస్తాలలో వేసి తూకం వేసి అమ్మేస్తున్నారు. ఈ రకం ధాన్యాన్ని ఉభయ గోదావరి జిల్లాల్లో ఉప్పుడు బియ్యం తయారు చేసేందుకు వ్యాపారులు తరలిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది 30 నుంచి



దాన్యంను బస్తాల్లో తూకం వేస్తున్న రైతులు

35 బస్తాల దిగుబడి రాగా.. ఈ ఏడాది పంట పొట్ట దశలో ఉన్నప్పుడు కురిసిన వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 25 బస్తాల దిగుబడి వచ్చిందని తెలిపారు.

తేలిక రకం వేశాం..



ఈ ఏడాది తేలిక రకమైన తరంగిణి వేశాం. 90 రోజుల్లో పంట దిగుబడి వచ్చింది. ఈ ధాన్యం దంపుడు బియ్యం తయారు చేసేందుకు తూర్పు, పశ్చిమ గోదావరి నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పంట కోసిన వెంటనే పట్టుకుపోతుండడంతో పొలం వద్దే అమ్మేస్తున్నాం. గతేడాది ఇదే రకం ఎకరాకు 30 బస్తాల దిగుబడి రాగా.. ఈ ఏడాది మాత్రం 25 బస్తాల వరకు దిగుబడి వచ్చింది.

– బొత్స రాములు, రైతు, నీలానగరం, వీరఘట్టం మండలం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వీరఘట్టం కోటదుర్గమ్మ



వీరఘట్టం దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



కిమ్మి గ్రామంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భవానీ భక్తులు

ఆది పరాశక్తీ నమోస్తుతే..

వీరఘట్టం:

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపంలో యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తులు సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 11 వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కిమ్మిలో కూడా దుర్గాదేవికి పూజలు చేశారు.

వెలవెలబోతున్న సేవా కేంద్రాలు

- సచివాలయాల్లో సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఒక్కొక్కటిగా నిలిచిపోతున్న సేవలు
- ఓపెన్ కాని ప్రభుత్వ సైట్లు
- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరుకు ఆటంకం
- ప్రజలకు తప్పని అవస్థలు



బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామ సచివాలయం

పార్వతీపురంటౌన్: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా సుమారు ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలు గ్రామస్థాయిలోనే ప్రజలకు అందేవి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ వలంటీర్ల ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పని పూర్తయ్యేది. స్థానిక సమస్యల పరిష్కారంలో సచివాలయాలు కీలకపాత్ర పోషించాయి. ప్రజా సేవా కేంద్రాలుగా ఉన్న సచివాలయాలు కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్వీర్యమయ్యాయి. సర్వర్లు తరచూ మొరాయిస్తుండటంతో ప్రభుత్వ వెబ్‌సైట్లు ఓపెన్ అవ్వడం లేదు. కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆయా సైట్లు ఓపెన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు? అవి అసలు ఉద్యోగాలే కాదంటు అవహేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ ఉద్యోగులతోనే పింఛన్లు పంపిణీ చేస్తోంది. సచివాలయాల్లో సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. ఈ ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై, క్షేత్ర స్థాయిలో ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగిన సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు వేలు జనాభాకు ఒక సచివాలయం

రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున జిల్లాలో సుమారు 350 గ్రామ, వార్డు సచివాలయాలను నిర్మించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షలు చొప్పున ఖర్చుచేశారు. ఒక్కో సచివాలయంలో సుమారు 9 మంది చొప్పున 3200 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు ఐదు వందలకు పైగా ప్రభుత్వ సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించేవారు. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు లబ్ధిదారులకు పథకాలు చేరవేడయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కీలకంగా పనిచేశారు. వివిధ ప్రభుత్వ సేవలు పొందేందుకు వచ్చే ప్రజలతో సచివాలయాలు సందడిగా కనిపించేవి.

వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు



ప్రస్తుతం కొత్తగా పింఛన్లు, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. వెబ్‌సైట్ ప్రారంభమైన వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. వెబ్‌సైట్ ఓపెన్ అయితే గ్రామాల్లో అర్హులైన వారికి సమాచారం అందజేస్తాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, పార్వతీపురం


ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

సీతంపేట: స్థానిక వైటీసీలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు సోమవారంశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, గ్రామసభల నిర్వహణ, తాగునీటి సమస్య పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ గీతాంజిలి, ఈఓపీఆర్‌డీ సత్యం, ఏఓ మాస, ఎంఓటీలు సుదర్శనరావు, పాపారావు, రాజశేఖరం, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపసర్పంచ్‌లే కీలకమని ఈవోపీఆర్‌డీ గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు ఏ విధంగా వేసుకోవాలి, గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలని, నిధుల సద్వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుచేస్తే గ్రామ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధిలో భాగం కావాలి..

భామిని: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకపాత్ర పోషించాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి. చంద్రరావు ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సమస్యలపై సమష్టిగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు, రిసోర్స్‌పర్సన్స్ భవానీశంకర్, కె.సంతోష్‌కుమార్, కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులున్నారు.



వీరఘట్టం: మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు

అభివృద్ధి అందరి బాధ్యత..

వీరఘట్టం: గ్రామ పంచాయతీల అభివృద్ధి అందరి బాధ్యతని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు చేయడంతో పాటు తాగునీరు, పారిశుధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఏపీఓ జి.సత్యంనాయుడు, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.



భామిని: మాట్లాడుతున్న మండల ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం, ఎంపీడీఓ చంద్రరావు



గరుగుబిల్లి: సూచనలిస్తున్న ఈవోపీఆర్‌డీ గోపాలరావు

ఆరోగ్య తనిఖీలు



వృద్ధురాలి ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యుడు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గోరటి గిరిజన గ్రామంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి హాజరైన గ్రామస్తులకు వైద్యుడు రవికుమార్ ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం రాఫా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కంటి మహంతి మాట్లాడుతూ అనారోగ్యం బారినపడిన వెంటనే అశ్రద్ధ చేయకుడా ఆస్పత్రిని సంప్రదించి, వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాఫా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసన్న కంటి మహంతి, ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో మోసం..



ఎలక్ట్రానిక్ కాటాపై ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం

వీరఘట్టం: రైతులను మోసం చేసేందుకు వ్యాపారుల తమదైన శైలిలో ఎగబడుతున్నారు. ముఖ్యంగా ధాన్యం తూకంలో ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తూ తప్పుడు తూకం తూస్తున్నారు. 80 కిలోల బస్తా పేరుతో 85 కిలోలు తూస్తూ రైతులను మోసం చేస్తున్నారు. విషయం రైతులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని నీలానగరం, తదితర ప్రాంతాల్లో సోమవారం ధాన్యం వ్యాపారులు పంటను కొనుగోలు చేశారు. అయితే ఎలక్ట్రానిక్ కాటాల ద్వారా సులువుగా మోసం చేసే అవకాశం ఉండడంతో వ్యాపారులు వాటినే వినియోగిస్తున్నారు. అధికారులు ఇటువంటి కాటాలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్

- జీసీడీఓ శ్రీనివాసరావు



బైక్ మెకానిజంపై విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న జీసీడీఓ శ్రీనివాసరావు

వీరఘట్టం: వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా జీసీడీఓ బి.శ్రీనివాసరావు అన్నారు. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు దసరా సెలవుల్లో వృత్తి విద్యపై ఇస్తున్న శిక్షణను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాలలో అన్ని పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రవేట్ బైక్ మెకానిక్ వద్ద ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే బాలికలకు టైలరింగ్‌లో ఇస్తున్న శిక్షణను కూడా పరిశీలించారు. శిక్షణను బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వై.హరిప్రసాద్, ట్రైనర్ టి.ఈశ్వరి, ఆర్.కుమారి పాల్గొన్నారు.

సక్రమంగా వీఓ ఎన్నికలు

భామిని: గ్రామాల్లో మహిళా సంఘాల సమ్మతితో గ్రామైక్య సంఘాల (వీఓ) ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అనానరు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా ఏపీఎంగా విధుల్లో చేరిన మీసాల చక్రపాణిని కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మనుమకొండ, గురండి సర్పంచ్‌లు నిమ్మల కేశవ, జామి భైరాగి, పార్టీ నాయకులు బోదెపు శ్రీనివాసరావు, వెలుగు సిబ్బంది కృష్ణవేణి, సీఓ ఎస్.రాజు, సీసీలు పాల్గొన్నారు.

పండగ పూట స్వచ్ఛత నై..



కొత్తవీధి కూడలి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



సుబుద్ధి కూడలి వద్ద వ్యర్థాల సముదాయం

పాలకొండ రూరల్: పట్టణంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో అన్ని వార్డుల్లో సంబరాలు కొనసాగుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి భక్తులతో పాటు బంధువులు పాలకొండ చేరుకున్నారు. అయితే ప్రధాన వీధుల్లో పారిశుధ్యం లోపించడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పండగ పూట కూడా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి పారి శుధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధికారులకు సత్కారం



అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: నీతి అయోగ్, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రొగ్రాంలో భాగంగా సంపూర్ణ అభియాన్ ముగింపు వేడుకలు సోమవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి సత్కరించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బ్లాక్ స్థాయి అధికారులు, ఫ్రంట్‌లైన్ కార్మికుల మద్దతుతో విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ, సామాజికాభివృద్ధిలో మంచి ఫలితాలు సాధించామన్నారు. మండల ఎంఈఓ, ఏపీఓ, సీడీపీఓ, వైద్యాధికారులకు పీఓ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 9వ తేదీ ఆఖరు అని, ఈ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్ కోరారు. ఇదే విషయమై సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన మద్యం షాపులు కావాలనుకునే వారంతా నాన్ రిఫండబుల్ డీడీ, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను ఎక్సైజ్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. కురుపాం ఎక్సైజ్ శాఖ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు సంబంధించి, ఆరు దుకాణాలకు గాను ఇప్పటివరకు నలభై రెండు దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.